క్లుప్తంగా

రంజాన్ కానుకల పంపిణీ



వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలో ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన రంజాన్ కానుకలను బీఆర్ఎస్ నాయకులు సోమవారం రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, ఎంపీపీ బీమ జమున, తహసీల్దార్ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, నాయకులు రేగుల్లరాములు, నాగధర్, దొల్ల రాజేశ్వర్‌రెడ్డి, ఆకుల రాజేశ్వర్, శ్రీధర్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పెర్కిట్(ఆర్మూర్) : ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో ఉన్న విశాఖ అపార్ట్‌మెంట్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది ప్రకాశ్, ప్రసన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్మూర్ టౌన్ : దివ్యాంగ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం 2022–23కుగాను పునరావాస పథకం కింద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. 11మంది దరఖాస్తుల చేసుకోగా అందులోంచి అర్హులైన ఆరుగురికి ఇంటర్వ్యూలు నిర్వహించి ముగ్గురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో భార్గవి, టీఎంసీ ఉదయ్‌శ్రీ తదితరులు పాల్గొన్నారు.

అక్బర్‌నగర్‌లో గ్రంథాలయం ప్రారంభం



రుద్రూర్ : రుద్రూర్ మండలం అక్బర్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామీణ గ్రంథాలయాన్ని సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి, జెడ్పీటీసీ నరోజి గంగారాం, సర్పంచ్ గంగామణిప్రసాద్, ఉపసర్పంచ్ రంజిత్, విండో మాజీ చైర్మెన్ పత్తిరాము, రైతు సమితి అధ్యక్షుడు తోట సంగయ్య పాల్గొన్నారు.

సైదాపూర్ తండాలో కంటి వెలుగు..



వర్ని : వర్ని మండలం సైదాపూర్ తండాలో వైద్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ హరిదాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రేణుక, ఎంపీపీ మేక శ్రీలక్ష్మీ వీర్రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కలాల్ గిరి, శివరాం, బలరాం వైద్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందల్వాయిలో గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

ఇందల్వాయి : గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి విద్యార్థుల భర్తీకి ఇందల్వాయి మండలంలోని తిర్మన్‌పల్లిలో నూతనంగా నిర్మించిన గిరిజన బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో 23వ తేదీ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ బీ.శ్రీలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలకు చేరుకునే మార్గంలో ఉన్న ఇందల్వాయి రైల్వేగేటు పరీక్ష తేదీన మరమత్తుల నిమిత్తం మూసి ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రహించాలన్నారు. పరీక్ష కేంద్రానికి నిజామాబాద్ నుంచి వచ్చే విద్యార్థులు డిచ్‌పల్లి–కమలాపూర్–రాంపూర్ మార్గంలో, కామారెడ్డి నుండి వచ్చే విద్యార్థులు గన్నారం–నల్లవెల్లి–వెంగల్‌పాడ్ మీదుగా తిర్మన్‌పల్లికి చేరుకోవచ్చాని తెలిపారు. వివరాలకు 83339 25399లో సంప్రదించాలన్నారు.

దర్జాగా ఫుట్‌పాత్ కబ్జాలు



పెర్కిట్‌లో 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన కోకాలు

- వాహనదారులకు ఇబ్బందులు
- ఆర్మూర్ పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు
- పట్టించుకోని అధికారులు

పెర్కిట్(ఆర్మూర్) : రహదారులపై ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు అక్రమార్కులతో నిర్వీర్యమవుతున్నాయి. పాదచారులు, చిన్నారులు నడవడానికి రహదారుల వెంట ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు కబ్జాకు గురవుతున్నాయి. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లి 63, 44వ నెంబరు జాతీయ రహదారుల పక్కన ఐదేళ్ల క్రితం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఆర్మూర్ పట్టణం నుంచి మామిడిపల్లి, పెర్కిట్ గ్రామాల నుంచి వెళ్లే రహదారుల పక్కన ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. ఆర్మూర్ పట్టణంలోని బస్టాండ్‌తో పాటు, పెర్కిట్‌లో 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ పాఠశాలలను పానుకుని ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లను కొందరు అడ్డాగా మార్చుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు.

పెర్కిట్ కూడలిలో..

పెర్కిట్ జాతీయ రహదారుల కూడలిగా ఉండడంతో నిత్యం అనేక వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అలాగే పక్కనే కూరగాయాల మార్కెట్ ఉండడంతో కొనుగోలు దారుల తాకిడి అధికంగా ఉంటుంది. దీంతో పాటు రహదారి పక్కనే ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఫుట్‌పాత్‌లపై కోకాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తుండడంతో రహదారి ఇరుకుగా మారి పాదచారులకు ఇబ్బందిగా మారింది. కోకాల ఏర్పాటుతో రహదారి ఇరుకుగా మారగా పాదచారులు రోడ్లపైనే నడుస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కాగా ఐదు నెలల క్రితం అప్పటి మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ అక్రమ కోకాలను పోలీసు బందోబస్తుతో తొలగించారు. తొలగించిన కొద్ది రోజులకే వ్యాపారులు తిరిగి ఏర్పాటు చేసుకుని అధికారులకు సవాలుగా మారారు. పెర్కిట్‌కు చెందిన కొందరు రాజకీయ పలుకుబడితో కోకాలు ఏర్పాటు చేసి వ్యాపారుల నుంచి నెల నెల అద్దె తీసుకుంటున్నట్లు సమాచారం. అద్దె వసూలు చేస్తున్న వారే తిరిగి కోకాలు ఏర్పాటు చేసి వ్యాపారం కొనసాగేలా వ్యాపారులకు వెన్నుదన్నుగా ఉంటున్నారు. ఐదు నెలల క్రితం పోలీసు బందోబస్తుతో కోకాలను తొలగించడంలో ఆర్భాటం ప్రదర్శించిన మున్సిపల్ అధికారులు కోకాలు మళ్లీ ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేయడంపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. అక్రమ కోకాలను తొలగించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తూ కోకాలు ఏర్పాటు చేసుకుని వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ ఇబ్బంది కలిగించే విధంగా ఉన్న కోకాలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలి. లేదంటే మున్సిపల్ నిభందనల ప్రకారం చర్యలు తీసుకుంటాం.
– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్ కార్తీక్‌రెడ్డి

నియోజకవర్గాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయాలు జరపాలని ప్రజాప్రతినిధులు, అధికారులు కోరారు. ఆయా మండలాల్లో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.



ఎడపల్లిలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజిత యాదవ్..



నాగేపూర్‌లో..



ఆలూర్‌లో..



నవీపేటలో..



భీమ్‌గల్‌లో..



వేల్పూర్‌లో..



అమ్రాద్‌లో..

క్యాన్సర్‌పై భయాందోళన వద్దు

బోధన్ : క్యాన్సర్ వ్యాధి బాధితులు భయాందోళనకు గురికావద్దని ఇందూర్ క్యాన్సర్ హాస్పిటల్ హెచ్‌వోడీ పెద్దిమ్మారెడ్డి, వైద్యులు డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, కార్తీక్, శైలజ సూచించారు. క్యాన్సర్ వ్యాధి రాక ముందు, వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బోధన్‌కు చెందిన ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణ కేంద్రంలోని గంజ్ ప్రాంతంలో ఆర్టీసీ కాలనీలో క్యానర్స్ వ్యాధి, సీపీఆర్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం తమ ట్రస్ట్, దాతల సహకారంతో క్యానర్స్ బాధితులు నలుగురికి రూ. 20 వేలు, మరో నలుగురికి రూ. 5 వేల చొప్పున ఆర్థికసాయం అందించినట్లు ట్రస్ట్ నిర్వాహకురాలు ఆరోగ్య జ్యోతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

చెక్కుల పంపిణీ

రెంజల్(బోధన్) : మండలంలోని సాటాపూర్ గ్రామంలో పలువురు లబ్ధిదారులకు మంజూరు అయిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం స్థానిక సర్పంచ్ ఎఖార్ పాషా అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మాషెట్టికి అవార్డు..



బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ పట్టణంలో 52ఏళ్లుగా వ్యాపర వేత్తగా, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా కార్యదర్శిగా, వాసవి క్లబ్ క్యాబినెట్ మెంటర్‌గా, శివాలయం కమిటీ మెంటర్‌గా అనేక సేవలు అందించిన మాషెట్టి సర్పయ్యకు అరుదైన గౌరవం లభించింది. సేవా రంగంలో సేవలు అందించిన సర్పయ్యకు ఉగాది జాతీయ నంది అవార్డు 2923కు గాను వరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో నంది పురస్కారాన్ని ఆయనకు అందించారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



అక్బర్‌నగర్‌లో ఇఫ్తార్‌లో పాల్గొన్న పోచారం సురేందర్ రెడ్డి తదితరులు

రుద్రూర్ : మైనార్టీల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని బాన్సువాడ నియోజక వర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి అన్నారు. అక్బర్‌నగర్‌లో రంజాన్ మాసం దీక్షల సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. అంతకుముందు రంజాన్ కానుకలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నరోజి గంగారాం, సర్పంచ్ గంగామణిప్రసాద్, ఉప సర్పంచ్ రంజీత్, రైతు సమితి అధ్యక్షుడు తోట సంగయ్య, లాల్‌మొహమ్మద్, బాల్‌రాజ్, మారుతి గౌడ్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

ఒడ్యాట్‌పల్లిలో..



భీమ్‌గల్‌లో ఈరవత్రి అనిల్ తదితరులు

మాక్లూర్ : మండలంలోని ఒడ్యాట్‌పల్లి గ్రామంలో సోమవారం రాత్రి స్థానిక మైనార్టీ ప్రజలు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బడుగు సత్యం పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్ : మండల కేంద్రంలో జిల్లా మైనారిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రఫీ, ముస్సావీర్ హుస్సేన్ ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్ పాల్గొన్నారు. ఈ విందులో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, నియోజక వర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేంద్ర, మహేష్, అవినాష్ పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం



నవీపేట : దళిత అవార్డు గ్రహీతలకు టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. నవీపేటకు మాజీ ఉప సర్పంచ్ తెడ్డు పోశెట్టి, రెంజల్ మండలంలోని కూనెపల్లికి చెందిన లింగంలకు ఇటీవల దళిత అవార్డులు అందజేశారు.

క్రీడా భవనాన్ని అందుబాటులోకి తేవాలి

బోధన్‌టౌన్(బోధన్) : బోధన్ పట్టణంలోని శక్కర్ నగర్ కాలనీలోని ఎస్ఎస్ఎఫ్ స్థలంలో నిర్మించిన మినీ స్టేడియం భవనాన్ని ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని దిశ కమిటీ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీరాజ్ ఏఈ సాయిలును కలిశారు. మినీ స్టేడియం నిర్మించి ప్రారంభించక పోవడంతో భవనం యొక్క కిటికీలు, ఫ్లోరింగ్, అందులో ఏర్పాటు చేసిన తలుపులు పగిలి పోయాయని, ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ప్రారంభిస్తే క్రీడాకారులకు ఉపయోగపడుతుందన్నారు.

విద్యాసంస్థల పేరుతో ప్రచారం సరికాదు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని గంజ్ రోడ్డులో నారాయణ విద్యాసంస్థల పేరుతో పాఠశాల, కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని జరుగుతున్న ప్రచారం మాదృష్టికి వచ్చిందని, ఇది నిజం కాదని, నారాయణ విద్యాసంస్థల ఏజీఎం శివాజీ పటేల్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని రైస్ మిల్ అసోసియేషన్ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. సదరు విద్యాసంస్థలతో నారాయణ విద్యాసంస్థలకు ఎలాంటి సంబంధం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు మోసపోవద్దన్నారు. ఈ విషయాన్ని విద్యాశాఖ, పోలీస్ శాఖ దృష్టికి తీసుకెళ్లనున్నామన్నారు. ఈ సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జి పెర్క వెంకటేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న నారాయణ విద్యాసంస్థల ఏజీఎం శివాజీ పటేల్

వ్యాయామం చేయిస్తేనే ఫలితం

ధర్పల్లి : పిల్లలకు ప్రతిరోజు ఇంటి వద్ద వ్యాయామాలు చేస్తే ఫలితం ఉంటుందని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ధర్పల్లి మండల కేంద్రంలోని భవిత సెంటర్లో తెలంగాణ సమగ్ర శిక్షణ ఆధ్వర్యంలో దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు మురళి తదితరులున్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన చందూర్ కాంగ్రెస్ నేతలు

రుద్రూర్ : చందూర్ రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కాంగ్రెస్‌కు చెందిన ఎంపీపీ భర్త బీజేపీలో చేరుతారనే ఊహాగానాల మధ్య అనుహ్యంగా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీగా గెలుపొంది ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన శేషుగారి లావణ్య, ఆమె భర్త రాంరెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. సమాచారం తెలుసుకున్న బీజేపీ నాయకులు ఎంపీపీని, ఆమె భర్తను కలిసి పార్టీలోని ఆహ్వానించారు. బీజేపీలో చేరడానికి సుముఖంగా ఉన్నట్లు ప్రకటించారు. త్వరలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి సమక్షంలో బీజేపీలో చేరుతారనే ప్రచారం మండలంలో ముమ్మురంగా సాగింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులతో హైదరాబాద్ వెళ్లిన చందూర్ ఎంపీపీ భర్త రాంరెడ్డి సోమవారం డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. రాంరెడ్డితో పాటు చందూర్ విండో డైరెక్టర్ లక్ష్మాపూర్ బాలయ్య, ఘన్‌పూర్ మాజీ ఉప సర్పంచ్ సలీం బీఆర్ఎస్‌లో చేరారు. వీరి వెంట బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, విండో చైర్మెన్ అశోక్, సర్పంచ్‌లు సత్యానారాయణ, గంగారాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంబర్‌సింగ్ తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ నేతలను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

కార్మికుల పీఆర్‌సీ బకాయిలు చెల్లించాలి

బోధన్ : స్థానిక మున్సిపాలిటీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రావాల్సిన 30 శాతం పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2021 జూన్ నెల నుంచి మున్సిపల్ కార్మికులకు 30 శాతం పీఆర్‌సీ అమలు చేయాలని ప్రకటించగా, బోధన్ మున్సిపాలిటీలో 2022 జనవరి నెల నుంచి అమలు చేస్తున్నారన్నారు. కమిషనర్‌ను విన్నవించగా చెల్లిస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. పీఎఫ్,ఈఎస్ఐ డబ్బులు క్రమతప్పకుండా కార్మికుల ఖాతాలో జమ చేయడం లేదన్నారు. కార్మికులు భూమయ్య, ప్రభాస్, సంజీవ్, పోశెట్టి, శకుంతల, గంగారాం, అబ్బయ్య, మరియమ్మ, శంకరమ్మ, లక్ష్మి, పరమేష్, గంగాధర్, పార్వతి , సాయిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఫ్టూ జిల్లా కార్యదర్శి మల్లేశ్

అర్హులు ఓట్లు నమోదు చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్ : అర్హులైనవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇదే చివరి అవకాశమని సోమవారం తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బూత్ లెవల్ ఆధికారులతో సమావేశం నిర్వహించారు. ఓట్ల సవరణ, ఓటర్‌కార్డుకు ఆధార్ లింకు చేయాలని బీఎల్‌వోస్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోస్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.



వివరిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్‌గౌడ్

రాయకూర్‌లో అంబేడ్కర్ జయంతి



రాయకూర్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

రుద్రూర్ : రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలో అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ప్రధాన వీధుల ద్వారా ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఆర్మూర్‌టౌన్ : ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఉన్న శివాలయంలో సోమవారం భక్తులు అధిక సంఖ్యాలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి సతీమణి రజితరెడ్డి పాల్గొని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మాక్లూర్ మండలం చిక్యాల గ్రామ ప్రజలు తరలివచ్చారు. అన్నదానం చేశారు. కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ గంగారెడ్డి, గంగాకిషన్, మీనాచందు, నక్క లక్ష్మన్, చిన్నారెడ్డి, అయ్యప్ప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'తెలంగాణ తరహా పనులు ఎందుకు చేపట్టడం లేదు'



కమ్మర్‌పల్లి : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తెలంగాణ తరహా పనులు ఎందుకు జరగడం లేదని బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండలాధ్యక్షుడు రేగుంట దేవేందర్ ప్రశ్నించారు. సోమవారం ఆయన కమ్మర్‌పల్లి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఇస్తున్న డబ్బులు కేంద్రానివే అన్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ వ్యాఖ్యలను ఖండించారు. ఎన్ఆర్ఈజీఎస్ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నేరుగా నిధులు ఇచ్చే పథకం కానే కాదన్నారు. ఏ రాష్ట్రమైతే పని దినాలు ఎక్కువగా కల్పిస్తుందో ఆ రాష్ట్రానికి ఎక్కువ నిధులు వస్తాయన్నా విషయం మాజీ ఎమ్మెల్యేకు తెలియకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పని దినాల విలువకు తోడుగా 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ డబ్బుల్లో రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. రాష్ట్రంలో చేపట్టిన వైకుంఠ ధామాలు, డంపింగ్ యార్డులు, రైతు భవనాలు, నర్సరీలు, హరితహారం, జీపీ భవనాల నిర్మాణం వంటి కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టినట్లయితే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇవే కార్యక్రమాలు ఎందుకు జరగడం లేదన్నారు. నాయకులు తీగల హరీష్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి రఘు పాల్గొన్నారు.